# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 26-07-2026 | సంపుటి - 30 | సంచిక - 63 | రూ : 4 | పేజీలు: 8


## 21 ఏండ్లకే యువత

# ఎంపీలు, ఎమ్మెల్యేలవ్వాలి

### అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపుతాం



- లోక్‌సభలో జెన్ జీ ఒక శాతం కంటే తక్కువే రాహుల్ మంత్రివర్గంలో వారికే విద్యా శాఖ
- జెన్ జీ పోరాటం

ఆగొద్దు.. ముందుకెళ్లాలి : ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పిలుపు

- విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

హైదరాబాద్ : దేశంలోని యువతకు రాజీవ్‌గాంధీ 18 ఏండ్లకే ఓటు హక్కు కల్పించారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు వయో పరిమితిని 21 ఏండ్లుగా నిర్ణయించారు. కానీ లోక్‌సభకు 25 ఏండ్లు, రాజ్యసభకు 30 ఏండ్లు దాటితేగానీ ఎన్నిక కావడం లేదు. చట్టసభల్లో జెన్ జీ గ్రూపు వాళ్లు ఒక్క శాతం కూడా లేరు. జర్మనీ, యూకే లాంటి దేశాల్లో 18 ఏండ్లకే ఎంపీలు, ప్రధానమంత్రులయ్యే అవకాశముంది. అలా మన దగ్గర ఎందుకు కావొద్దు. తరువాయి 2లో

## 'ఇందిరమ్మ టవర్స్'కు

# ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబరు

- కాల్‌సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: 'క్యూర్' పరిధిలో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందించనున్న 'ఇందిరమ్మ టవర్స్'కు సంబంధించి సందేహాల నివృత్తికి హౌసింగ్ బోర్డు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, ఇళ్ల కేటాయింపులపై 040 24603572 నంబరును సంప్రదిస్తే పూర్తి సమాచారాన్ని అందిస్తారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కార్యాలయంలో శనివారం రెవెన్యూ,



హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. "ప్రజలు తమ సందేహాలపై మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా కాల్ సెంటరుకు ఫోన్ చేయాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి తరువాయి 2లో

## ఇక్కడ అంతర్జాతీయం.. అక్కడ భారతీయం

2లో

- మన దేశానికి తరలి వస్తున్న విదేశీ విశ్వవిద్యాలయాలు
- పలు దేశాల్లో ఐఐటీ, ఐఐఎంల ప్రాంగణాలు




## నకిలీ వెబ్‌సైట్లు చూసి మోసపోవద్దు

# విమాన ప్రయాణికులకు కేంద్రం హెచ్చరిక



- ఎయిర్ సువిధ 2.0 పేరుతో నకిలీ వెబ్‌సైట్లు మోసాలకు పాల్పడుతున్నాయన్న కేంద్రం
- ఈ సేవలు పూర్తిగా ఉచితమని, ఎలాంటి రుసుము చెల్లించొద్దని ప్రభుత్వం స్పష్టీకరణ
- వ్యక్తిగత వివరాలు ఇచ్చే ముందు వెబ్‌సైట్ URLను సరిచూసుకోవాలని సూచన
- ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ప్రయాణికుల ఆరోగ్య పర్యవేక్షణకు ఈ పోర్టల్ ఏర్పాటు
- వివిధ ఏజెన్సీలతో రియల్ టైమ్ డేటా షేరింగ్ కోసం ఆధునిక వ్యవస్థ

2లో

## యునెస్కో జాబితాలోకి సారనాథ్

# భారతీయులందరికీ గర్వకారణం : ప్రధాని మోదీ

- యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో సారనాథ్‌కు చోటు
- భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి దక్కిన గొప్ప గౌరవంగా అభివర్ణన
- ఈ గుర్తింపుపై సంతోషం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



2లో

## ఏపీలో ఇంజినీరింగ్ ఫీజులు ఖరారు

# కనీస ఫీజు ఎంతంటే?



- బీటెక్ కనీస వార్షిక ఫీజు రూ.47 వేలుగా నిర్ణయం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- బీటెక్ తో పాటు బీఆర్క్, మెరైన్ ఇంజినీరింగ్ ఫీజులు కూడా ఖరారు
- కాలేజీ, కోర్సును బట్టి ఫీజులు మారే అవకాశం



## హిందూ మహాసముద్రంలో

# స్టార్‌షిప్ వ్యోమనౌక సేఫ్ ల్యాండింగ్

- టెక్సాస్ నుంచి విజయవంతంగా దూసుకెళ్లిన స్టార్‌షిప్ ఫ్లైట్-13
- ప్రయోగంలో భాగంగా 20 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టిన వైనం
- బూస్టర్ రాకెట్ ఇంజిన్ లోపంతో గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో క్రాష్ ల్యాండింగ్

2లో

## కేంద్ర మంత్రి పదవికి రాజీనామా..

# 'ఎక్స్' బయో మార్చేసిన ధర్మేంద్ర ప్రధాన్

- కొద్ది గంటల్లోనే 'ఎక్స్' బయో నుంచి 'కేంద్ర మంత్రి' హోదా తొలగింపు
- నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కీలక నిర్ణయం
- దేశ వ్యతిరేక శక్తులు లబ్ధి పొందకుండా ఉండేందుకేనని వెల్లడి



# 21 ఏండ్లకే యువత ఎంపీలు, ఎమ్మెల్యేలవ్వాలి

హైదరాబాద్ : దేశంలోని యువతకు రాజీవ్‌గాంధీ 18 ఏండ్లకే ఓటు హక్కు కల్పించారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు వయో పరిమితిని 21 ఏండ్లుగా నిర్ణయించారు. కానీ లోక్‌సభకు 25 ఏండ్లు, రాజ్యసభకు 30 ఏండ్లు దాటితేగానీ ఎన్నిక కావడం లేదు. చట్టసభల్లో జెన్ జీ గ్రూపు వాళ్లు ఒక్క శాతం కూడా లేరు. జర్మనీ, యూకే లాంటి దేశాల్లో 18 ఏండ్లకే ఎంపీలు, ప్రధానమంత్రులయ్యే అవకాశముంది. అలా మన దగ్గర ఎందుకు కావొద్దు. చట్టసభల్లో పోటీచేసే వయస్సును 21 ఏండ్లకు కుదిస్తూ ఆగస్టు మొదటి వారంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించి కేంద్రానికి పంపుతాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా శనివారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీకి వేలాదిగా యువత తరలొచ్చింది. జెన్‌జీనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. పీవీనరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ చైర్మెన్ల వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏండ్లకే తగ్గించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏండ్లకే ఓటు వేయగలుగుతున్నారనీ, 21 ఏండ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏండ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎన్నికకావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలుంటే 30 శాతంగా ఉన్న జెన్‌జీకి ఒక్క శాతం లోపే ప్రాతినిధ్యం ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏండ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని చెబుతూ...21 ఏండ్లకే శ్రీలక్ష్మి, 22 ఏండ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య ఐఏఎస్‌లుగా, 22 ఏండ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్‌గా ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్‌కు ప్రదర్శనగా వెళ్లడం కాదు... రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏండ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశముంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశముంటుందన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో విద్యా శాఖ జెన్ జీ నేతకు ఇస్తామనీ, దీనిపై రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని హామీనిచ్చారు. విద్యా, ఐటీ వంటి కీలకమైన శాఖలను 60, 70, 90 ఏండ్లవారికి కాకుండా 21 ఏండ్ల వారికే ఇవ్వాలనీ, తమకేం కావాలో వారికే తెలుసని అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. వారు సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో వారు రాజీనామా చేయించాగలిగారని కొనియాడారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై బనాయించిన కేసులను సోమవారం లోపు ఎత్తేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యునెస్కో జాబితాలోకి సారనాథ్.. భారతీయులందరికీ గర్వకారణం

న్యూఢిల్లీ/వారాణసి: ఉత్తరప్రదేశ్‌లోని పురాతన బౌద్ధ పుణ్యక్షేత్రం సారనాథ్‌కు యునెస్కో (UNESCO) ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చోటు లభించింది. దక్షిణ కొరియాలోని బుసాన్ వేదికగా జరుగుతున్న 48వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు భారతదేశంలో 44 ప్రదేశాలకు యునెస్కో గుర్తింపు ఉండగా, తాజాగా సారనాథ్ ఈ జాబితాలో చేరడంతో ఆ సంఖ్య 45కి పెరిగింది. ఈ చారిత్రక పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "ఇది ప్రతి భారతీయుడికీ ఎంతో గర్వకారణమైన క్షణం! ఉత్తరప్రదేశ్‌లోని సారనాథ్ యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరడం అత్యంత సంతోషకరం. బుద్ధ భగవానుడితో సారనాథ్‌కు ఎంతో గాఢమైన ఆధ్యాత్మిక బంధం ఉంది. ఆయన అందించిన జ్ఞానం, కరుణ, సామరస్యం అనే శాశ్వత సందేశాలు నేటికీ ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతదేశపు సుదీర్ఘ నాగరికతకు, ఆధ్యాత్మిక వైభవానికి దక్కిన గొప్ప గౌరవం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక వేత్తలు, పర్యాటకులు సారనాథ్‌ను దర్శించి బుద్ధుని దివ్య ఆదర్శాలతో మమేకం కావడానికి ఇది మరింత ప్రేరణనిస్తుంది" అని ప్రధాని కొనియాడారు. బోధ్‌గయాలో జ్ఞానోదయం పొందిన అనంతరం గౌతమ బుద్ధుడు తన ఐదుగురు శిష్యులకు మొదటిసారిగా 'ధర్మచక్ర ప్రవర్తన సూత్ర' బోధన చేసింది సారనాథ్‌లోనే కావడం విశేషం. ప్రాచీన ధమేఖ్ స్థూపం, అశోక స్తంభం, అనేక పురాతన విహారాల అవశేషాలతో అలరిస్తున్న ఈ క్షేత్రం దాదాపు 2,500 ఏళ్ల బౌద్ధ సాంప్రదాయానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సారనాథ్‌కు ప్రపంచ వారసత్వ అంతస్తు దక్కడంతో బౌద్ధ ఆధ్యాత్మిక పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో బహుళ ప్రచారం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నకిలీ వెబ్‌సైట్లు చూసి మోసపోవద్దు.. విమాన ప్రయాణికులకు కేంద్రం హెచ్చరిక

అంతర్జాతీయ ప్రయాణికుల కోసం ఉద్దేశించిన 'ఎయిర్ సువిధ 2.0' పోర్టల్ పేరుతో కొన్ని నకిలీ వెబ్‌సైట్లు మోసాలకు పాల్పడుతున్నాయని, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం శనివారం హెచ్చరించింది. ఈ నకిలీ సైట్లు ప్రయాణికుల నుంచి వ్యక్తిగత వివరాలు సేకరించి, వారిని పేమెంట్ గేట్‌వేలకు మళ్లించి డబ్బులు వసూలు చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఎయిర్ సువిధ 2.0 సేవలు పూర్తిగా ఉచితమని, సెల్ఫ్ డిక్లరేషన్ ఫారం సమర్పించడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రయాణికులు తమ వ్యక్తిగత లేదా ప్రయాణ సంబంధిత సమాచారాన్ని పంచుకునే ముందు వెబ్‌సైట్ యొక్క URLను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించింది. airsuvidha.civilaviation.gov.in మాత్రమే అధికారిక పోర్టల్ అని, దీనిని మాత్రమే వినియోగించాలని కోరింది. అనధికారిక వెబ్‌సైట్లలో ఎలాంటి చెల్లింపులు చేయవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని విజ్ఞప్తి చేసింది.

**ఎందుకీ 'ఎయిర్ సువిధ 2.0'?**

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (DRC), ఉగాండా దేశాల్లో ఎబోలా/బుండిబుగ్యో వైరస్ వ్యాప్తి చెందడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా (PHEIC) ప్రకటించింది. ఈ నేపథ్యంలో, అంతర్జాతీయ ప్రయాణికుల ఆరోగ్య పర్యవేక్షణను పటిష్ఠం చేసేందుకు గత నెలలో కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (DIAL) సహకారంతో 'ఎయిర్ సువిధ 2.0'ను ప్రారంభించింది. ఇది పూర్తిగా కాంటాక్ట్‌లెస్ ప్యాసింజర్ హెల్త్ సెల్ఫ్ డిక్లరేషన్ పోర్టల్. దీని ద్వారా ప్రయాణికుల ఆరోగ్య సమాచారాన్ని ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (IDSP), రాష్ట్ర సర్వైలెన్స్ అధికారులతో రియల్ టైమ్‌లో పంచుకుంటారు. ఈ విధానం వల్ల ప్రమాదంలో ఉన్న ప్రయాణికులను త్వరగా గుర్తించి, వారికి అవసరమైన వైద్య పర్యవేక్షణ, చికిత్స అందించడం సులభతరం అవుతుంది. ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకున్నాక భౌతికంగా ఎలాంటి ఫారాలు నింపాల్సిన అవసరం లేకుండా ఈ ప్రక్రియను రూపొందించారు.

## హిందూ మహాసముద్రంలో స్టార్‌షిప్ వ్యోమనౌక సేఫ్ ల్యాండింగ్

అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రముఖ ప్రైవేట్ సంస్థ స్పేస్‌ఎక్స్ మరో చారిత్రక మైలురాయిని దాటింది. టెక్సాస్‌లోని బోకా చిగా వద్ద గల స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన "స్టార్‌షిప్ ఫ్లైట్ 13" రోదసిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. భవిష్యత్తులో మానవులను చంద్రుడు, అంగారక గ్రహంపైకి తీసుకెళ్లేందుకు, పూర్తిస్థాయి పునర్వినియోగ రాకెట్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన ఈ ప్రయోగం అంతరిక్ష చరిత్రలో ఎంతో కీలకమైనదిగా నిలిచింది. శనివారం ఉదయం నింగిలోకి లేచిన ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్, నిర్ణీత సమయానికి అంతరిక్షంలోకి చేరుకుంది. ప్రయోగం ప్రారంభమైన రెండు నిమిషాల తర్వాత ప్రధాన రాకెట్ నుంచి బూస్టర్ విభాగం వేరైంది. అయితే, తిరోగమన దిశలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో ల్యాండ్ కావాల్సిన 'బూస్టర్20' రాకెట్ ఇంజిన్ స్టార్టింగ్ సమస్యల వల్ల నియంత్రణ కోల్పోయి సముద్రంలో ల్యాండ్ కాకుండా దెబ్బతింది. మరోవైపు ప్రధాన వ్యోమనౌక (స్టార్‌షిప్ 40) అంతరిక్షంలో ప్రయాణిస్తూ, దాదాపు 20 నెక్స్ట్ జనరేషన్ 'స్టార్‌లింక్ వెర్షన్3' ఇంటర్నెట్ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి విడుదల చేసింది. అనంతరం ప్లాన్ చేసినట్లే గంటన్నర ప్రయాణం తర్వాత భూ వాతావరణంలోకి పునఃప్రవేశించి, హిందూ మహాసముద్రంలో అత్యంత సురక్షితంగా నీటిపై పడి (సోఫ్ట్ స్ప్లాష్ డౌన్) తేలియాడింది. స్టార్‌షిప్ వ్యోమనౌక సముద్రంలో క్షేమంగా ల్యాండ్ కావడం ఇదే తొలిసారి కావడంతో, "ఇది ఎంతో సంతోషకరమైన దృశ్యం" అని స్పేస్‌ఎక్స్ బృందం కొనియాడింది. సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేశారు.

## ఏపీలో ఇంజినీరింగ్ ఫీజులు ఖరారు కనీస ఫీజు ఎంతంటే?

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించి ఫీజులను ఖరారు చేస్తూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, బీటెక్ కోర్సుకు కనీస వార్షిక ఫీజును రూ.47 వేలుగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది. బీటెక్‌తో పాటు బీఆర్క్ (B.Arch), మెరైన్ ఇంజినీరింగ్ వంటి ఇతర వృత్తి విద్యా కోర్సులకు కూడా ఫీజులను ఖరారు చేసింది. అయితే, అన్ని కాలేజీల్లోనూ ఇదే ఫీజు ఉండదు. ఆయా కాలేజీల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, కోర్సును బట్టి ఫీజుల నిర్మాణంలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఈ కొత్త ఫీజుల విధానం తక్షణమే అమల్లోకి రానుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఈ కనీస ఫీజు ఆధారంగా, ఒక్కో కాలేజీకి వేర్వేరుగా ఫీజులు వర్తిస్తాయి. త్వరలో ప్రారంభం కానున్న ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నాటికి ఫీజుల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టత ఇవ్వడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## కేంద్ర మంత్రి పదవికి రాజీనామా.. 'ఎక్స్' బయో మార్చేసిన ధర్మేంద్ర ప్రధాన్

నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే ఆయన తన 'ఎక్స్' ఖాతా బయోలో మార్పులు చేశారు. తన ప్రొఫైల్ నుంచి "కేంద్ర విద్యాశాఖ మంత్రి" అనే హోదాను తొలగించి, ప్రస్తుతం తనను "సంబల్‌పూర్ ఎంపీ"గా పేర్కొన్నారు. అలాగే బీజేపీ కార్యకర్తగా తన వివరాలను యథాతథంగా కొనసాగించారు. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, విద్యావ్యవస్థలోని అవకతవకలపై విద్యార్థులు నుంచి వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన రాజీనామాకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన దేశ వ్యతిరేక శక్తులు ప్రస్తుత పరిస్థితిని ఆసరాగా చేసుకుని గందరగోళం సృష్టించకుండా నిరోధించేందుకే తాను పదవి నుంచి వైదొలగినట్లు వెల్లడించారు. మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు అంగీకరించిన ఆయన, బాధ్యత వహించేందుకు తాను ఎన్నడూ వెనుకాడబోనని స్పష్టం చేశారు. "పరీక్ష మాఫియా కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదని, ఎవరికీ అన్యాయం జరగకూడదన్నదే నా సంకల్పం" అని పేర్కొన్నారు. గత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా కలిచివేశాయని, ఇది కేవలం వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ఆయన వివరించారు.

## 'ఇందిరమ్మ టవర్స్'కు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబరు

హైదరాబాద్: 'క్యూర్' పరిధిలో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందించనున్న 'ఇందిరమ్మ టవర్స్'కు సంబంధించి సందేహాల నివృత్తికి హౌసింగ్ బోర్డు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, ఇళ్ల కేటాయింపులపై 04024603572 నంబరును సంప్రదిస్తే పూర్తి సమాచారాన్ని అందిస్తారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కార్యాలయంలో శనివారం రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ''ప్రజలు తమ సందేహాలపై మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా కాల్ సెంటరుకు ఫోన్ చేయాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని పొందవచ్చు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు, హిందీ, ఇంగ్లిషు, ఉర్దూ భాషలతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల లక్ష్యంలో భాగంగా తొలి విడతగా 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ప్రజలు ఏ నియోజకవర్గంలో నివాసం ఉంటే అక్కడే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే చేయాలి. దరఖాస్తు సమయంలో రూ.10 వేల చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలి. ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు పంపిస్తారు. అర్హత ఉన్న కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తారు'' అని మంత్రి వివరించారు. కార్యక్రమంలో శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్, బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ అంతర్జాతీయం.. అక్కడ భారతీయం

హైదరాబాద్: భారతీయ యువత విదేశీ విద్య కోసం అధిక సంఖ్యలో తరలివెళ్తున్న నేపథ్యంలో వారిని నిలువరించేందుకు విదేశీ వర్సిటీలను ఇక్కడికి రప్పిస్తుండగా.. ప్రతిష్ఠాత్మక భారతీయ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు పలు దేశాల్లో క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, ఇటలీ వంటి దేశాలకు చెందిన ప్రముఖ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లను ప్రారంభిస్తున్నాయి. ఐఐటీలు, ఐఐఎంలు గల్ఫ్, ఆఫ్రికా ఖండంతోపాటు ఆసియాలోని పలు దేశాల్లో ప్రాంగణాలను నెలకొల్పుతున్నాయి.

**ఐఐటీలు, ఐఐఎంలు అక్కడ..**

ప్రపంచవ్యాప్తంగా మన ఐఐటీలు, ఐఐఎంలకు మంచి పేరుంది. అందుకే ప్రాంగణాలను ప్రారంభించాలని పలు దేశాలు భారత్‌ను కోరాయి. ఈ మేరకు 202324 నుంచి ఐఐటీ మద్రాస్ టాంజానియా (ఆఫ్రికా)లోని జాంజిబార్ క్యాంపస్‌లో తరగతులు ప్రారంభించింది. 2024 25లో ఐఐటీ దిల్లీ యూఏఈలోని అబుధాబీలో.. 202526లో ఐఐఎం అహ్మదాబాద్ దుబాయ్‌లో ప్రాంగణాలను నెలకొల్పాయి. ఐఐటీ బెంగళూరు కూడా ఇండోనేసియాలో క్యాంపస్‌ను ఏర్పాటు




చేసేందుకు నిర్ణయించింది. దీనిపై తాజాగా ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఒప్పందం కుదిరింది. ఐఐటీ మద్రాస్ శ్రీలంకలోనూ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే భూటాన్, మొరాకో, నైజీరియా దేశాల నుంచి వినతులు రావడంతో కేంద్రం వాటిని పరిశీలిస్తోంది. ''టెక్నాలజీకి ఐఐటీలు, మేనేజ్‌మెంట్ విద్యకు ఐఐఎంలకు ప్రపంచవ్యాప్తంగా పేరుండటంతో ఆ రంగాల్లో వెనుకబడిన పలు దేశాలు మన క్యాంపస్‌లను ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాయి'' అని ఐఐఈఎస్‌టీ షిబ్పూర్ డైరెక్టర్ ఆచార్య వీఎంవీఆర్ మూర్తి తెలిపారు.

**అక్కడి నుంచి ఇక్కడికి..**

ఏటా 4.5 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. ప్రధానంగా అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాలకు పెద్దసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడికే ఆ వర్సిటీలొస్తే కొంతవరకు విద్యార్థులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించవచ్చని జాతీయ నూతన విద్యా విధానం2020 సిఫార్సు చేసింది. ఈ క్రమంలోనే విదేశీ యూనివర్సిటీల ఏర్పాటుకు 2023లో కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇంతవరకు నాలుగు విశ్వవిద్యాలయాలకు యూజీసీ అనుమతులివ్వగా.. అవి తరగతులను ప్రారంభించాయి. మరో 11 యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లను ప్రారంభించేందుకు ప్రాథమిక అనుమతి ఇచ్చింది. అందులో మూడింటికి తరగతులను ప్రారంభించుకోవడానికి తాజాగా కేంద్ర ప్రభుత్వం 'లెటర్ ఆఫ్ అప్రూవల్' కూడా జారీచేసింది. 202425లోనే ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్, వోల్లోంగాంగ్ వర్సిటీలు అహ్మదాబాద్‌లోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్)లో తరగతులను ప్రారంభించాయి. 2025 26లో యూకేకు చెందిన సౌతాంప్టన్ వర్సిటీ గురుగ్రామ్‌లో, యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించాయి. హైదరాబాద్‌లోనూ క్యాంపస్‌లను ప్రారంభించేందుకు పలు విదేశీ వర్సిటీలు యూజీసీకి దరఖాస్తు చేశాయి.

# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్




ప్రజాస్ఫూర్తి, ఖమ్మంజిల్లా: జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "నా పట్టు - నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పట్టుపరిశ్రమ రైతులతో ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, ఖర్చు, నీటి వినియోగం, రాబడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు. ఒక్కో రైతు విడివిడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేస్తే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర పట్టు బోర్డు, బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా. జి. సుబ్రహ్మణ్యం కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి, ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వామ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ పంప్ సెట్ పనితీరును పరిశీలించిన రెడ్కో వైస్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని గార్లపాడులో వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ పనితీరును శనివారం రైతు డిస్కం , రెడ్కో వైస్ చైర్మన్ & ఎండీ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ , ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర, ఐఏఎస్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్, పరిశీలించారు. నేరుగా రైతుతో మాట్లాడుతూ పనితీరును తెలుసుకొని సోలార్ పంప్ సెట్ వలన కలిగే లాభాలను వివరించారు. ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. రైతు మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందని వ్యక్తం చేస్తూ అనంతరం రావినూతల గ్రామంలో ఇంటిపై ఏర్పాటు చేస్తున్న రూఫ్టాప్ సోలార్ ప్లాంట్ పనితీరును నేరుగా లబ్ధిదారుని తో మాట్లాడి , ఉచిత విద్యుత్ తో పాటు అదనపు ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వం వలన చాలా సంతోషముగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్కో ఉన్నతాధికారులు, ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సీపీఓగా కిష్టయ్యకు అదనపు బాధ్యతలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ)గా అదనపు బాధ్యతలు స్వీకరించిన కిష్టయ్య శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రస్తుత సీపీఓ జవహర్లాల్ ములుగు జిల్లాకు బదిలీ కావడంతో, ప్రస్తుతం స్టాటిస్టికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిష్టయ్యకు సీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కిష్టయ్యకు సూచించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన మాజీ సీపీఓ జవహర్లాల్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సమిష్టి విజయం

* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం విద్యార్థుల సమిష్టి పోరాట విజయమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి జె పి పిలుపు మేరకు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ కోసం సాగిన ఉద్యమం విజయం సాధించిదని, ఇది నియంతృత్వ ప్రభుత్వం పై విద్యార్థులు సాధించిన విజయం అని , జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటం లో పాల్గొన్న విద్యార్థులకు, మద్దతు ఇచ్చిన వివిధ రాజకీయ పక్షాలకు, ప్రజాసంఘాల కు ప్రజాతంత్ర వాదులకు అభినందనలు తెలుపుతూ ,నీట్ పేపర్ లీక్ విషయంలోనే కాకుండా మొత్తం విద్యా వ్యవస్థ లో మార్పులు రావాలని అందుకు చైతన్య వంతమైన పోరాటాలు అవసరం అన్నారు. విద్యా, వైద్యం ప్రభుత్వం అధీనం లో ఉండే విధంగా ప్రభుత్వ విధానాలలో మార్పులు చేయాలని కోరారు.

## ఘనంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి మెంబర్ జేబీ శౌరి ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినారు . ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలను ఎన్నో జరుపుకోవాలని కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో ఓబిసి జిల్లా చైర్మన్ అల్లాడి నరసింహారావు , జిల్లా కార్యదర్శి గౌస్ మోహినుద్దీన్ ,మాజీ ఎంపీటీసీ ఆరిఫ్ ,సీనియర్ నాయకులు దుర్గారాశి సమ్మయ్య , ఏలూరి రాందాస్ ,హరి సింగ్ ,పల్లి వేణు ,యువజన కాంగ్రెస్ నాయకులు ఎండి ఉస్మాన్ , రాజేష్ , నిరంజన్ ,రాము విజయ్, కన్నయ్య ,సుమన్ , వంశీ తదితరులు పాల్గొన్నారు .

## చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి: సాంబలక్ష్మి

* **రేగొండలో చాకలి ఎస్సీ సాధన సమితి మండల కమిటీ ఎన్నిక**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజాస్ఫూర్తి): చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు గోపరాజు సాంబలక్ష్మి డిమాండ్ చేశారు. రేగొండ మండలం రేపాక గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మొగుళ్ల అజయ్, యూత్ అధ్యక్షుడిగా మొగుళ్ల నరేష్, ఉపాధ్యక్షుడిగా మామిడాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ తిరుపతి, కోశాధికారిగా బూర్గుల వెంకటేష్‌ను ఎంపిక చేశారు. అలాగే రేపాక గ్రామ అధ్యక్షులుగా మొగుళ్ల కుమార్, మొగుళ్ల రాజయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన మండల అధ్యక్షుడు మొగుళ్ల అజయ్ మాట్లాడుతూ, చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, ప్రభుత్వం తమకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుళ్ల కరుణాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎంశ్రీ పాఠశాలల్లో బాలికల వికాసానికి ఉపయోగపడే కార్యక్రమాలు అమలు పరచాలి

* **జిల్లా విద్యాధికారి పి సుశీందర్రావు.**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పీఎం శ్రీ ప్రధానోపాధ్యాయులతో శనివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో 43 పాఠశాలల్లో విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి దోహదపడే కార్యక్రమాలు పారదర్శకంగా జరగాలని బాలికల సమగ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యాధికారి సుసింధర్ రావు అన్నారు. తల్లిదండ్రులు సమాజ సహకారంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పడుతున్న కార్యక్రమాలను వివరించి విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలని కోరారు. డిజిటల్ తరగతులు, అటల్ టింకరింగ్ ల్యాబ్లు, సైన్స్ ల్యాబ్లను విరివిగా వినియోగించి విద్యార్థులకు సాంకేతిక శాస్త్రీయ అవగాహన పెంచాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాల స్థాయిలో అమలుపరిచి కార్పొరేట్ పాఠశాలలకు మించి ఫలితాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల విద్యాధికారులు పాఠశాలల పర్యవేక్షణ పెంచి ఉపాధ్యాయుల హాజరు మధ్యాహ్న భోజన నిర్వాహణ పై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక గణాంక అధికారి ఎం బాలాజీ నాయక్, సెక్టోరియల్ అధికారులు, కత్తుల అరుంధతి,అండెం శ్రీనివాస్ గౌడ్, ముచ్చర్ల శ్రీనివాస్, కత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా ఆడహాక్ కమిటీ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) కార్యాలయంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్‌ను ఆడహాక్ కమిటీ సభ్యులతో కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా హనుమండ్ల రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు అర్హతలు ఉన్నప్పటికీ అక్రిడిటేషన్ కార్డులు పొందకుండా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి వివక్ష లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని చేరవేసే వారధులుగా పనిచేస్తున్నారని, వారి సేవలను గుర్తించి తగిన గౌరవం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి అంబాల కుమారస్వామి, సంయుక్త కన్వీనర్లు పల్లె శ్రీనివాస్, బండ రాజ్ కుమార్, రాచగొల్ల సత్యనారాయణ, కోకన్వీనర్లు కొండి సాయి కిరణ్, మురుదొడ్డి కార్తీక్, దొంత పురుషోత్తం, హెచ్. ప్రవీణ్, శివరామకృష్ణ, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, ఆంగోతు లక్ష్మణ్, శ్రీరాంపసాద్ మిట్టగడుపుల మహేందర్ పాల్గొన్నారు.

## మారోజు జోగయ్య జ్ఞాపకార్థం నోట్ బుక్స్ పంపిణీ




గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పొనుగోడు నందు పూర్వ విద్యార్థి, నల్గొండ జిల్లా లో ప్రధానోపాధ్యాయులు గా పని చేస్తున్న మారోజు సుధాకర్ వారి సోదరుడు మారోజు శ్రీనివాస్ తమ తండ్రి మారోజు జోగయ్య జ్ఞాపకార్థం హై స్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఇట్టి కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ శకటికం వేణు పాల్గొని దాతలను అభినందించారు. విద్యార్థులు అందరు క్రమ శిక్షణ తో చదువుకొని ఉన్నత స్థాయి కి ఎదగాలని విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగిచారు. మారోజు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ తండ్రి ఆ రోజుల్లో విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత వల్ల తమ కుటుంబాల్లో ఇప్పుడు 40 మంది ప్రభుత్వ ఉద్యోగులు గా వున్నారు అని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తాము ఎల్లప్పుడు పాల్గొంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీను, ప్రభాకర్, నిమ్మల శ్రీనివాసు, శ్రీనివాస్ నగేష్, రామ్ ప్రసాద్, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్

* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం జిల్లాలోని చేగుంట మండల పరిధిలో గల కేజీబీవీని కలెక్టర్ సందర్శించారు. ముందుగా 6,7 వ తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 8 వరకు టేబుల్స్ చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను పరిశీలించారు. ఫాస్ట్ మ్యాథ్స్, గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. కొన్ని కంప్యూటర్లు మరమ్మతులు గురి కాబడినవని, తెలుసుకొని వెంటనే బాగు చేయించి అందరికీ ఆన్ అకాడమీ అందుబాటులో తీసుకురావాలన్నారు. వంట గదిలోకి వెళ్లి, వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. డైట్ చార్ట్ ప్రకారం వంటలు చేశారా? లేదా? అని అడిగి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారనీ ఆరా తీశారు. కేజీబీవీ పరిసరాల చుట్టూ పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని, ఎలాంటి చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ను ఆదేశించారు. అన్ని కేజీబీవీ లలో కిచెన్ గార్డెన్ ల ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందరికీ అన్ని అంశాలు తెలియదని, ప్రతిరోజూ చదివితే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభ తరం అవుతుందని యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగ పడతాయన్నారు. ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నీ బోధించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు,బి డబ్ల్యు ఓ హేమా భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి,గణాంక అధికారి నవీన్ కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి వేడుకలో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తొలి ఏకాదశి అత్యంత పవిత్రమైన పండుగ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి ఏకాదశి శుభసందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా సూర్యాపేట నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో తులతూగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్, వల్దాసు దేవేందర్, ఆలయ ఇవొ లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతుగంటి వెంకటేశ్వర్లు, నకరికంటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## కోమల్ల టోల్ ప్లాజా చార్జీలు పెంపు

* **ఈ నెల 27 అర్ధరాత్రి నుంచి కొత్త టారిఫ్ అమలు.**

జనగామ/రఘునాథ్ పల్లి, ప్రజాస్ఫూ ర్తి : జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు స్వల్ప భారం పడ నుంది. జిల్లా లోని కోమల్ల టోల్ ప్లాజా వద్ద టోల్ చార్జీలను పెంచుతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ, కోమల్ల టోల్ ప్లాజా మేనే జర్ వెంకట్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 27 అర్ధరాత్రి నుంచి కొత్త టోల్ రేట్లు అమల్లోకి రానున్నా యి. గతంతో పోలిస్తే కార్ల టోల్ చార్జీ రూ.5 మేర పెరగనుంది. ఇప్పటి వరకు కార్లకు సింగిల్ ట్రిప్ రూ.125 ఉండగా, కొత్త రేటు ప్రకారం రూ.130చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రిటర్న్ జర్నీ చార్జీ రూ.185 నుంచి రూ.190కు పెరుగు తుంది. అదేవిధంగా ఇతర కమర్షియల్ వాహనాల టోల్ చార్జీల్లో కూడా స్వల్ప పెంపు ఉంటుందని తెలిపారు. కొత్త టా రిఫ్‌కు సంబంధించిన పాత, కొత్త రేట్ల జాబితాను ఈ సందర్భంగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జనగామ ఆర్టీఏ పరిధి లోని వాహన యజమానులు కన్సెషన్ పాసులు తీసుకుని టోల్ చార్జీ ల్లో 50 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని టోల్ ప్లాజా మేనేజర్ సూచించారు. కొత్త టోల్ రేట్ల అమలు లో వాహనదారులు టోల్ నిర్వహణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పేదలకు చేరువగా అత్యవసర వైద్య సేవలు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ చేతుల మీదుగా ఈసీఐఎల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల సహకారంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అందించిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఐసీయూ అంబులెన్స్ను శనివారం ఘనంగా ప్రారంభించారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఐసీయూ అంబులెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు, ప్రసూతి అత్యవసరాలు వంటి సందర్భాల్లో రోగులను మెరుగైన వైద్య కేంద్రాలకు సురక్షితంగా తరలించేందుకు ఈ అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యంగా గిరిజనులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అత్యవసర వైద్య సేవలు పొందడంలో ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ అంబులెన్స్ అందుబాటులోకి రావడం హర్షణీయమని పేర్కొన్నారు. ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయడంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఈ దిశగా సహకారం అందించిన ఈసీఐఎల్ సంస్థను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ రంగ సంస్థలు తోడ్పాటు అందించడం అభినందనీయమని, సమాజ అభివృద్ధికి ప్రభుత్వం-ప్రభుత్వ రంగ సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ ఇన్చార్జి వేణుబాబు, హెచ్ ఆర్ మేనేజర్ ప్రదీప్ చక్రవర్తి, ఎండి ఇస్మాయిల్, సాంబమూర్తి మహిపాల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి, డాక్టర్ వెంకట రాములు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యాంసుందర్ శర్మ, మహబూబాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు, చీకటి మహేష్, సింగారపు సతీష్, దారా ఇందుభారతి, రాధాపటేల్, పద్మావతి, నరసింహారెడ్డి, చెల్పూరి వెంకన్న, సురేష్, శ్యామ్, దిడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ మృతికి చుంచుపల్లి మండల సీపీఐ కమిటీ సంతాపం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పాల్వంచ మండలం దంతెలబోర గ్రామం, ఎస్సీ కాలనీ సర్పంచ్ సోడె వెంకటరమణ మృతిపట్ల సీపీఐ చుంచుపల్లి మండల కార్యదర్శి, విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి సంతాపం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ చుంచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో మురళి మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన వెంకటరమణ వైద్యం వికటించి మృతిచెందడం బాధాకరమన్నారు. సర్పంచ్‌గా గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, సీపీఐ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారని గుర్తుచేశారు. ఆమె మృతి పార్టీకి, ఎస్సీ కాలనీ గ్రామ ప్రజలకు తీరని లోటు అని అభివర్ణించారు. సంతాపం తెలిపిన వారిలో పెనుబల్లి, ప్రశాంతినగర్, గౌతంపూర్, పెనగడప సర్పంచ్‌లు రెడ్డి సుజాత, వాడె రామకృష్ణ, సపావట్ కళ్యాణి, కారం సీతారాములు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## ఫరుఖ్ నగర్లోని బ్రహ్మంగారి ఆలయంలో గీతా పారాయణం



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : ఫరూక్ నగర్ లో ని శ్రీ శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి సందర్భంగా గీతా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాని కి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొని తన భక్తి భావాన్ని చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అందె మోహన్ కౌన్సిలర్లు కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్, రాజు నాయక్ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఖదీర్ నాయకులు గంగనమోని సత్తయ్య, గంగాధర్ మరియు రిటైర్డ్ ఎంఈఓ ఆకుల విద్యాసాగర్, కుర్వగడ్డ నరసింహులు, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జి ఆకస్మిక తనిఖీలు

* **గిరిజన ఆశ్రమ, దివ్యాంగుల పాఠశాలల్లో వసతుల పరిశీలన**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు హెచ్ఎంఆర్డీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న దివ్యాంగుల విద్యార్థుల పాఠశాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించి, భోజన నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు సరైన ఆహారం అందుతున్నదా అని వారితో మాట్లాడి తెలుసుకున్నారు. పిల్లలను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి శ్రద్ధగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీల్లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర ఆలయంలో సహస్ర ఘటాభిషేకం

* **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీసీపీ రాజమహేంద్ర నాయక్..**



జనగామ, ప్రజాస్ఫూర్తి : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రం లోని గుండగడ్డ కాలనీ శ్రీ ఉమా మహేశ్వర దేవాలయంలో నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సహస్ర ఘటాభిషేకంలో పాల్గొని రాష్ట్రం లో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంట లు సమృద్ధిగా పండాలని, రైతులు, ప్రజ లందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ ఉమామహేశ్వర స్వామిని ప్రార్థించారు. దేవాలయ అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ధర్మపురి శ్రీనివాస్, పంతులు ప్రభాకర్ రావు, తాటి కుమార్, ప్రకాష్, కాచం నరసింహారావు, రాణి, రేణుక, అనురాధ, ఉమా తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## కఠిన చట్టాలు తీసుకొస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు: రామచందర్‌రావు



హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజ్ అంశంలో కేంద్ర ప్రభుత్వం 2024లోనే చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇప్పుడు ఆ చట్టానికి సవరణ చేయబోతోందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ప్రశ్నపత్రాలు లీకైతే బాధ్యులకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.15 కోట్లు జరిమానా విధించబోతున్నట్లు చెప్పారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేశారన్నారు. కఠిన చట్టాలు తీసుకువస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రామచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల ఉద్యమానికి విజయం చర్చలతో కేంద్ర ప్రభుత్వం

* **సీజేపీ ఒప్పందం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం – తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : ప్రజా సమస్యలను ప్రారంభం నుంచే చర్చల ద్వారా పరిష్కరించి ఉంటే దేశవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఆందోళనలు నివారించేవని ఆమె అన్నారు. ప్రజల గొంతును అణిచివేయడం, నిరసనలను నిర్లక్ష్యం చేయడం కంటే సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఆలస్యమైనా కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చి సీజేపీతో ఒప్పందానికి రావడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఒప్పందంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో, నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రజల గొంతును వినడం, చర్చలకు ప్రాధాన్యం ఇవ్వడం, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పందంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కోరారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

* **లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు డాక్టర్.చిల్లా రాజశేఖర్ రెడ్డి.**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్నా అని లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు, పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి అత్తగారైన స్వర్గీయ కొల్లి విజయలక్ష్మి 4 వ వర్ధంతి పురస్కరించుకుని శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, పంచశీల కాలనీలోని రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ ఆవరణలో ఏర్పాటుచేసిన "అన్నదాన" కార్యక్రమాన్ని ప్రాగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ.సిహెచ్. రాములు, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్చార్జి నందనం దివాకర్, పలువురు పారిశ్రామికవేత్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవే పరమావధిగా గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో విధాలుగా స్వయం సేవలు చేస్తున్నానన్నారు. పేద ప్రజలతో పాటు పేద విద్యార్థులకు, వికలాంగుల కు ఎన్నో విధాలుగా అండగా ఉంటూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేటికీ సేవలు అందజేస్తున్నామని తెలిపారు. తన జీవితాంతం సామాజిక సేవలు చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి కార్యదర్శి లయన్ డి.ఎల్లా సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోపాలకృష్ణారెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, అమావాస్య అన్నదాన కమిటీ సభ్యులు జింకల వెంకటేష్ ముదిరాజ్, మోతె రాజేశ్వర్, పారిశ్రామికవేత్తలు వాకిటి రామిరెడ్డి, కె.వి.రమణారెడ్డి, నాయర్ నరేంద్ర స్థానికులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి.. సంరక్షించాలి

: **దండు మల్కాపురంలో వనమహోత్సవం**

- **సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మొక్కలు, పెద్ద చెరువు దగ్గర ఈత మొక్కలు నాటారు. అనంతరం సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మొక్క నాటుకోవాలన్నారు. మొక్కను నాటడంతోపాటు సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈత మొక్కల వల్ల కలిగే లాభాలు, వాటి ఔషధ గుణాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మీసాల నర్సింహ్మ, వార్డు సభ్యులు ఈర్దుల ఇంద్రసేన, కొత్త ఐలమ్మ, పొట్లపల్లి శివ, సంగం నరసమ్మ, సుక్క రవి, అత్తాపురం సంతోష అంజిరెడ్డి, ఒంటెద్దు లక్ష్మమ్మ, ఎక్సైజ్ సి.ఐ బాలాజీ నాయక్, ఎస్.ఐ శంకర్, కానిస్టేబుల్స్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, గ్రామపంచాయతీ కారోబార్ పర్వతం శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకి ఉచిత న్యాయం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆర్థిక, సామాజిక లేదా మరి ఏ ఇతర కారణాల వల్లనైనా న్యాయం అందుకోకుండా ఎవ్వరూ ఉండరాదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని చేశారని అందుకే అర్హులైన అందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని న్యాయ సేవా సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వర్ రావు అన్నారు. న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అనంతారం, కురవి లోని వివిధ ప్రాంతాలలో ప్రజల అవగాహన నిమిత్తం న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్ ల పనితీరు ప్రయోజనాలను ఆయన వివరించారు. అనంతరం సంస్థ మధ్యవర్తిత్వ న్యాయవాది వై చెన్న మల్లారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ వంటి దురాచారాలకు కుటుంబాలు దూరంగా ఉండి బాలల భవిష్యత్తును కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్స్ ఎస్సై సునంద పాల్గొన్నారు. ఉచిత న్యాయసహాయం కోసం మహబూబాబాద్ న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని, ఉచిత సలహాల కోసం 15100 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

## నవోదయ, కేంద్రీయ విద్యాలయాల కోసం వినతి

* **విద్యాశాఖ అదనపు కార్యదర్శి సైదాను కలిసిన నాగరత్న సేవా సంఘం ప్రతినిధులు.**



హైదరాబాద్ /జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో నవోదయ, కేంద్రీయ విద్యాలయాల కోసం వినతి. శనివారం సచివా లయంలో నాగరత్న సేవా సంఘం అధ్యక్షులు బిర్రు ఇస్త్రారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు కార్యదర్శి సైదాను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కార్యదర్శి మా ట్లాడుతూ, జిల్లా లో నవోదయ, కేంద్రీ య విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించా మని, త్వరలో వాటి ఏర్పాటు దిశగా సానుకూల పరిణామాలు ఉంటాయన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అం శాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. బిర్రు ఇస్త్రారి మాట్లాడుతూ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థ లం, మౌలిక సదుపాయాలు అందుబా టులో ఉన్నాయని, వెనుకబడిన జిల్లా లో ఉన్నత విద్యాసంస్థలు వస్తే విద్యా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంద న్నారు. వీలైనంత త్వరగా ఈ విద్యాసం స్థలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ను కూడా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల గురించి అ డిగి తెలుసుకుని, త్వరలోనే జిల్లా లో సందర్శిస్తానని హామీ ఇచ్చారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్

**: కెపిహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు యాదవ్**




కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : వాహనదారులందరూ ట్రాఫిక్ నియమనిబంధనలను తప్పనిసరిగా పాటించి రోడ్డు భద్రతకు సహకరించాలని కెపిహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు యాదవ్ పిలుపునిచ్చారు. కెపిహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి వాహనదారుడి బాధ్యత కీలకమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే డ్రైవర్‌తో పాటు ముందు సీటులో కూర్చునే వ్యక్తి కూడా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసులతో సహకరిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని రాజు యాదవ్ పేర్కొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామం కిష్టాపురం గ్రామానికి చెందిన గూగులోత్ లక్ష్మికి 34000 రూపాయలు సీఎం రిలీఫ్ చెక్కును అందజెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా కాచనపల్లి సర్పంచ్ యలం రేవతి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్షిక రాజు మాట్లాడుతూ ఆర్థిక పరమైన ఇబ్బందులతో గురవుతున్న ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బానోత్ రాంబాబు, నునవత్ కిషన్, బానోత్ కిషన్, గూగులోత్ సోమ్లా, గూగులోత్ బీమాడు, బానోత్ కిషన్, కొట్టం వెంకటేష్, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాని, పార్టీ ముఖ్య నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రఘునాథపల్లిలో ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ప్రారంభం

* **వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా.**

జనగామ/రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రఘునాథపల్లిలో శనివారం ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్ ప్రారంభించారు. ఈ ప్రత్యామ్నాయ లైన్ ద్వారా 33 కేవీ జనగామ ఫీడర్ నుంచి నిడిగొండ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు, అక్కడి నుంచి రఘునాథపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీంతో రఘునాథపల్లి ప్రాంతంలో ఎలాంటి సాంకేతిక అంతరాయం ఏర్పడినా వెంటనే ఈ లైన్ ద్వారా ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా అందించనున్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో రఘునాథపల్లి నుంచి జనగామ, నిడిగొండ ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరాచేసే అవకాశం ఈ వ్యవస్థ ద్వారా కలగనుంది. ఈ ప్రత్యామ్నాయ లైన్ అందుబాటులోకి రావడంతో రఘునాథపల్లి, జనగామ, నిడిగొండ 33/11 కేవీ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ చెరుకు సంపత్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఏ.డీ



ఈ ఎ.స్వామి రెడ్డి, ఆపరేషన్ ఏడీఈ సుధాకర్, రఘు నాథపల్లి ఏ.ఈ టి.రమేష్,కన్‌స్ట్రక్షన్ ఏ. ఈ రాహుల్ తోపాటు ఆ శాఖ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్లు తమ సర్ ఫారం లు త్వరితగతిన సమర్పించాలి

* **మహబూబాబాద్ తహసిల్దార్ కట్టంచంద్ర రాజేశ్వర్ .**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు ప్రకారం శనివారం పట్టణంలోని కోర్టు సెంటర్లో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సంస్కృతిక సారధి బృందం సభ్యుల తో కలిసి తహసిల్దార్ అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా నియమ, నిబంధనలు ప్రకారం పూర్తి చేయాలని,బూత్ స్థాయి అధికారులుకు తెలిపారు. ఓటర్ల లు ఎస్ఐఆర్ ఫారమ్స్ పూర్తిచేసి త్వరితగతిన సమర్పించాలని మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ,తెలంగాణ సంస్కృతిక సారధి చైర్పర్సన్ జి. వెన్నెల సూచనల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని, తెలంగాణ సాంస్కృతిక సారథి భరత్ కుమార్, ఐలేష్,తెలిపారు, బృందంలోని సభ్యులు,బూత్ స్థాయి అధికారులు రేష్మ,సరిత, తదిరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యం

* **పనులను దగ్గరుండి పర్యవేక్షించిన కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలంలో విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యంగా నీటి ట్యాంకులు, తాగునీటి నల్లాల వద్ద ఏర్పడిన లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతు పనులను వేగవంతం చేశారు. వర్షాల కారణంగా నల్లాల లీకేజీలతో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో లీకేజీ ట్యాప్ కనెక్షన్లు, నల్లాలను పునరుద్ధరించే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ స్వయంగా వార్డులో పర్యటిస్తూ దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రతి ప్రాంతంలో లీకేజీలను వెంటనే సరిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యం కంటే మించిన ప్రాధాన్యం మరొకటి లేదు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, పరిశుభ్రతను కాపాడుతూ విషజ్వరాలకు అవకాశం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మున్సిపాలిటీతో సహకరించాలి" అని కోరారు.ఆమె వెంట నీటి సిబ్బంది లైన్ మెన్ కృష్ణ , బర్రె క్రాంతి ఉన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం.. పింఛన్ అందజేసిన సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధుడు బర్మ జంగయ్యకు గ్రామ సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సర్పంచ్ తన గౌరవ వేతనం నుంచి వృద్ధుడు జంగయ్య కు పింఛన్ కింద రూ.1,500లు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ శనివారం బర్మ జంగయ్యకు రూ.1,500ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత సుందర్ మాట్లాడుతూ ప్రభుత్వం జంగయ్య కు పింఛన్ ఇచ్చే వరకు తన గౌరవ వేతనం నుంచి ఆర్థిక సాయం చేస్తానన్నారు.వృద్ధుని ఆర్థిక అవసరాలను గుర్తించి మానవత్వంతో పింఛన్ రూపంలో ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ శ్రీలత సుందర్ ను పలువురు అభినందించారు.

## ఈ వంతెన నిర్మాణంతో ఆరు గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయి

* **రూ 5.5 కోట్లు నిధులు మంజూరు చేయించాలని మంత్రికి వినతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి యాదాద్రి భువనగిరి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర రోడ్డు భవనాల , సినిమా ఆటో గ్రాఫి శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని అదేవిధంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను మోటకొండూరు మండలం కొండాపురం సర్పంచ్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి కొండాపురం గ్రామంలోని వంతెన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూపాయలు 5.5 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడుతూ కొండాపురం గ్రామ పరిసర ప్రాంత ఆరు గ్రామాల ప్రజలు వంతెన ద్వారా ప్రయాణాలు చేస్తారని వారికి ఈ వంతెన నిర్మించినట్టయితే ఈ ఆరు గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయని అంతేకాకుండా అన్ని సౌకర్యాలకు అనుగుణంగా ఉంటుందని మంత్రి వంతెనపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వం తో మాట్లాడి వంతెన నిర్మాణం త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించి వంతెన నిర్మాణానికి రూ 5.5 కోట్ల నిధులును వెంటనే మంజూరు చేస్తానని త్వరలోనే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎం సింగల్ విండో చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

* **విష్ణు ఆలయాల్లో భక్తుల రద్దీ..**



జనగామ,ప్రజాస్ఫూర్తి : హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విష్ణు ఆలయాలు, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాలు, వెంకటేశ్వర స్వామి ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సహస్ర నామ పారాయణం, విష్ణు సహస్రనామ పఠనం, భజనలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, శ్రీ మహా విష్ణువు ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనేక మంది భక్తులు రాత్రి వరకు జాగరణ చేస్తూ హరినామ సంకీర్తనల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలు, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యముగా , సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తులు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, ఆలయాలు గోవింద నామస్మరణ తో మార్మోగాయి.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆరోగ్య పరీక్షా శిబిరం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వార్షిక ఆరోగ్య పరీక్షా శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో పాఠశాల విద్యార్థులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. నెహ్రూ నాయక్ (జనరల్ ఫిజీషియన్),డా. జె. జగన్ మోహన్ రావు (జనరల్ ఫిజీషియన్), డా. సురేందర్ (నేత్ర వైద్య నిపుణులు), డా. మసూద్ ధన్ రావు (శిశు వైద్య నిపుణులు), డా. కిరణ్ (దంత వైద్య నిపుణులు) పాల్గొని విద్యార్థులను ఎంతో శ్రద్ధగా పరీక్షించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్, శిశు వైద్య నిపుణులు డా. జె. ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల సేవలందించిన వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పరిశుభ్రతను పాటిస్తూ శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవలందించిన వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.ఈసందర్భంగామహీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికోసం విద్యతోపాటు ఆరోగ్యం, సంక్షేమం వంటి అన్ని అంశాల్లో పాఠశాల యాజమాన్యం తనవంతు సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

## ఊ సా వర్ధంతి సెమినార్ నిర్వహణ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నలంద డిగ్రీ కళాశాలలో వై కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన (ఊ సా)వర్ధంతి మరియు సెమినార్ నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విశ్రాంత తహసిల్దార్ ఉప్పల బాలరాజు సామాజిక ఉద్యమకారుడు నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ సామాజిక ఉద్యమకారుడు మల్లెల నరసింహారావు హాజరై ముందుగా (ఊ సా) చిత్రపటానికి పూలమాల అర్పనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ప్రభుత్వ విశ్రాంత తహసిల్దార్ ఉప్పల బాలరాజు మాట్లాడుతూ ఉద్యమాల ఉపాధ్యాయునిగా ఊ సాంబశివరావు( ఊ.సా) గా ప్రసిద్ధి చెందారు. దళిత బహుజన వామపక్ష, కుల, నిర్మూలన ఉద్యమాలలో ప్రముఖ సిద్ధాంతకర్తగా, వక్తగా, కార్యకర్తగా రెండు తెలుగు రాష్ట్రాలలో చెరగని ముద్ర వేశారు. అతని జీవితం నేటి సమాజానికి ఆదర్శం అని పేర్కొన్నారు. మరొక ముఖ్య అతిథి మల్లెల నరసింహారావు మాట్లాడుతూ ( ఊ సా )గొప్ప మేధావి బడుగు బలహీన వర్గాల ఉన్నతికై కృషి చేసిన వ్యక్తి అందరితో కలుపుకొని సాధారణ జీవితాన్ని గడిపినటువంటి వ్యక్తి అని పేర్కొన్నారు. ముఖ్యఅతిథి డోలి సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారంలోకి రావాలి అని కోరిన వ్యక్తి సామాజిక సమన్యాయం కోసం పరితపించిన వ్యక్తి (ఊ. సా)సిద్ధాంతానికి కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. భారతదేశంలోని నాయి బ్రాహ్మణ (మంగలి) మహనీయుల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య, రాష్ట్ర నాయకులు సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న ,రాష్ట్ర ఉపాధ్యక్షులు చాగంటి ప్రభాకర్, అల్వాల యాదగిరి సామాజిక అధ్యయనం వేదిక జిల్లా నాయకులు, సీనియర్ అడ్వకేట్ కొండపర్తుల యాదగిరి, భద్రాద్రి నాయి బ్రాహ్మణ సేవ సంఘ అధ్యక్షులు తిరుమల సదానందం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్నూరు విజయలక్ష్మి, మాజీ వార్డ్ కౌన్సిలర్ లక్ష్మి, లకావత్ పద్మ , అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మేధాశక్తి.. సృజనాత్మకత గుర్తించడానికి ఇంద్రధనస్సు దినోత్సవం

- **ట్రినిటీలో ఇంద్రధనస్సు దినోత్సవం**
- **ట్రినిటీ పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తి.. సృజనాత్మకతలను గుర్తించడానికి ఇంద్రధనస్సు దినోత్సవం ఉపయోగపడుతుందని ట్రినిటీ పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాల చిన్నారుల విభాగంలో శనివారం ఇంద్రధనస్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ట్రినిటీ పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల చేతులమీదుగా వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి విద్యార్థులకు ప్రపంచంలో ఉన్న వివిధ రంగుల గురించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. వివిధ రంగులలో ఉన్న కూరగాయలు, పండ్లు, వస్త్రాలతో విద్యార్థులు ప్రదర్శనలతో వివరించారన్నారు. వివిధ రంగుల పండ్లను కూరగాయలను చూసి రంగులను గుర్తించుటకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కేవీ బి కృష్ణారావు, ఉపాధ్యాయులు భార్గవి, స్వరూప, వనజ, పూజ రెడ్డి, మౌనిక, కరుణ, ఇందిర, దివ్య రెడ్డి, మౌనిక, శైలజ, మమత, వాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వరూప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, విద్యార్థి ఉద్యమం గెలిచింది.... ప్రజాస్వామ్యం నిలిచింది

* **కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : నీట్ పరీక్ష పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ పార్టీ , విద్యార్థి లోకం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన భారీ ధర్నా సందర్భంగా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ , విద్యార్థుల ప్రతిఘటనతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం పట్ల ప్రజాస్వామ్యం నిలిచింది అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పేపర్ దోషులను కఠినంగా శిక్షించాలని , కాంగ్రెస్ పార్టీ నాయకులు ,విద్యార్థులపై పెట్టని కేసులను ఎత్తివేయాలని , మృతి చెందిన విద్యార్థులకు నష్టపరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు

## జైల్ భరో విజయవంతం చేయాలి : సీఐటీయూ




జనగామ, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ నిర్వహించనున్న " జైల్ భరో " ఉద్యమాన్ని విజయవంతం చే యాలని సీఐటీయూ నాయకులు శని వారం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కార్మికులు,రైతులు, వ్యవసాయ కూ లీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ముఖ్యంగా లేబర్ కోడ్లు, కార్మిక హక్కుల పరిరక్షణ, రైతు సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రం లో జరిగిన సమావేశం లో ఉద్యమ కార్యాచరణ పై చర్చించి,విస్తృ తంగా ప్రజలను భాగస్వామ్యం చేయా లని నిర్ణయించారు.

## చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి



ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు.దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

# 100కు 100% సర్ ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

*** వికలాంగుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**



గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి : వందకు వందశాతం సర్ ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్, హుజూర్ నగర్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ ముత్తినేని వీరయ్య అన్నారు . శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. హుజూర్నగర్ నియోజకవర్గ పరిధిలో వందకు వందశాతం సర్ ప్రక్రియను పూర్తి చేయడమే మా లక్ష్యం అన్నారు. అభివృద్ధి సంక్షేమ ప్రధాత మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి తో నేటికీ 98.04% పూర్తి అయింది అన్నారు. మంత్రి ఉత్తమ్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ద్వారా నియోజకవర్గంలో సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓ పక్క మంత్రిగా ఎంత బిజీగా ఉన్నా సర్ పై ప్రత్యేక ద్రుష్టి సారించి అనేక సార్లు ప్రత్యక్షంగా 311 మంది బీఎల్ఎ లు, 36 మంది సూపర్ వైజర్ల తో పార్టీ మండలం &పట్టణ అధ్యక్షులు ఇతర కార్యవర్గం లతో మీటింగ్ లు పెట్టడం తో పాటు నిత్యము జూమ్ మీటింగ్ ల ద్వారా అనేక సూచనలు, సలహాలు, రివ్యూ లు చేస్తూ పార్టీ మండలాల వారీగా, పట్టణాల వారీగా ముఖ్యలకు&అవసరం అయినా చోట బీఎల్ఎ లకి సైతం ప్రత్యక్షంగా ఎప్పటికప్పుడు ఫోన్లు చేస్తూ దిశా నిర్దేశము చేయడం వలన దేశములో ఎక్కడ లేని విధంగా సర్ లో 98.04% పూర్తి అయింది అన్నారు. ఇంతటి సక్సెస్ కి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని అందరూ మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు,మాజీ ఎంపీపీలు, మాజీ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పెండింగ్ విషయాలు ను వారీ ద్రుష్టి కి తేవడం వలన నేటికీ నియోజకవర్గ వ్యాప్తంగా 311 బూతులకు గాను 137 బూతుల్లో 100కు 100% పూర్తి చేయడం జరిగిందన్నారు. 174 బూతుల్లో కూడా ఒకటి అర ఓట్లు మాత్రమే మిగిలాయని, మొత్తం నియోజకవర్గంలో 1.96 మాత్రమే పెండింగ్ ఉందని తెలిపారు. దాన్ని కూడా పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి బాల్దూరు సందీప్, ఎడవెల్లి ఉపేందర్ రెడ్డి, కొలిపాక లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి

*** ఎండీ ఇమ్రాన్**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఆగస్టు 25న భువనగిరిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా మహాసభల సందర్భంగా ప్రచురించిన కరపత్రాలను భువనగిరిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ఏఐటీయూసీ దేశంలోని తొలి జాతీయ కార్మిక సంఘంగా 1920 అక్టోబర్ 31న ముంబైలో స్థాపించబడిందని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో కార్మిక వర్గాన్ని భాగస్వామ్యం చేయడంలో, కార్మిక హక్కుల పరిరక్షణలో ఏఐటీయూసీ చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు. దేశంలో 8 గంటల పనిదినం, కనీస వేతనాలు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రసూతి సెలవులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి అనేక కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహించి కీలక విజయాలు సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల నిర్వీర్యం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధాన విస్తరణ వంటి చర్యలను ఎదుర్కోవాలంటే కార్మికుల ఐక్యత మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 25న భువనగిరిలో జరిగే జిల్లా మహాసభలో కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, పుట్ట రమేష్ జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, ముంతాజ్ బేగం, పిన్నం జగన్, ముదిగొండ బసవయ్య, అల్లంపల్లి కృష్ణ, మాడుగుల స్వామి, కొత్త కృష్ణ, దంతూరి గ్యానేశ్వర్, రచ్చ మోహన్ దాస్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలు దారి మళ్లించేందుకే మత రాజకీయాలు

*** సిపిఎం రాజకీయ విద్యా విభాగం రాష్ట్ర నాయకులు బోడపట్ల రవీందర్**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా సమస్యలను దారి మళ్ళించేందుకు మత రాజకీయాలు తీసుకొస్తున్నారని, మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర రాజకీయ విద్యా విభాగం నాయకులు బోడపట్ల రవీందర్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని మంచికంటి హాల్‌లో రెండు రోజులపాటు జరగనున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా మతోన్మాద కార్పొరేట్ రాజకీయాలు అనే అంశంపై బోడపట్ల రవీందర్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మత విభజన రాజకీయాలు పెరిగి ప్రజలను ఉన్మాదం వైపు తీసుకెళ్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు విజయగిరి శ్రీనివాస్, ఆవుల శ్రీరాములు, అన్నవరపు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న కార్యకర్తకు పరామర్శ

**- జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అర్ధ వెంకట్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ఎనగండి తండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నీలు నాయక్ కుమారుడు సాయి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అర్ధ వెంకట్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరెంటు శంకర్ నాయక్ తో కలిసి శనివారం ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతున్న సాయి ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన వంతు ఆర్థిక సాయం అందజేస్తానని వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## బీరన్న బోనాల్లో ఎమ్మెల్యే సందడి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీరన్న బోనాల మహోత్సవంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. గొల్ల, కురుమ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఊరేగింపులో భక్తులతో కలిసి బోనం ఎత్తుకొని కొంతదూరం నడిచి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీరన్న స్వామి గొల్ల, కురుమల ఆరాధ్య దైవమని, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బీరన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమై ఆహారం, క్రీడా సౌకర్యాలు కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బీబీనగర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్,కాలేజీ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కళాశాల కిచెన్ లోని కూరగాయలు, సరుకులు, వంట సామాగ్రి, గదులను పరిశీలించారు పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు క్రీడా పరికరాలు (స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్) అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన విద్యా పుస్తకాలు , శిక్షణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచడంతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు..ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు విబిజి రామ్‌జి ద్వారా కరువు ఉపశమన చర్యలు వేగవంతం చేయాలి

*** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విబిజీ రామ్ జీ పథకం ద్వారా కరువు ఉపశమన చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జెడ్పీ సీఈఓలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజినీర్లు, ఎంపీడీఓలతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జలసిరి, విబిజీ రామ్‌జీ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించాలని మంత్రి సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, కరువు ప్రభావాన్ని తగ్గించే పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.2026-27 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31, 2027 నాటికి 12 కోట్ల వ్యక్తి పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రస్తుతం నిర్దేశించిన 4.5 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామీణ కుటుంబాలకు తక్షణ ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి అవకాశాలు కల్పించేలా కూలీల సమీకరణ చేపట్టాలని తెలిపారు..అర్హులైన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి సంరక్షణ, కరువు నిరోధక పనులు మరియు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈలు సమన్వయంతో టీమ్‌గా పనిచేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ కార్యక్రమాలు, కరువు ఉపశమన చర్యలను వేగవంతం చేసి ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీఓ సురేష్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రీ రాకేష్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏరియా రెస్క్యూ స్టేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

*** ఐఎన్టీయూసీ ప్రెసిడెంట్ జి ఎం కు వినతి పత్రం**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియా మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఉద్యోగుల పలు సమస్యలు పరిష్కరించాలని ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుకు ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్. రజాక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ మైన్స్ రెస్క్యూ స్టేషన్‌ను సందర్శించి మైన్స్ రెస్క్యూ స్టేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా రెస్క్యూ శిక్షణ కోసం వచ్చే మహిళ ఉద్యోగులకుసరైన వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , ప్రత్యేక వసతి గదులు తక్షణమే ఏర్పాటు చేయాలని ,.రెస్క్యూ స్టేషన్ ఆవరణలో మహిళలు , పురుషుల కోసం తగిన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని , పురుషులకు కూడా సరైన వసతి సౌకర్యాలు లేవని , స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బ్రిగేడ్ సభ్యులకు ప్రత్యేకంగా ఉండేందుకు గదులు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు . స్పందించిన జిఎం అధికారులకు ఆదేశాలు పంపించి రెస్క్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నట్లు రజాక్ తెలిపారు .

## విద్యార్థులకు 'పోలీస్ అక్క'గా వ్యవహరించాలి

**– జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నియమితులైన మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు 'పోలీస్ అక్క'గా విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. జిల్లాలో అమలు చేయనున్న 'పోలీస్ అక్క' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు మహిళా పోలీసు సిబ్బందికి ఎస్పీ శనివారం అవగాహన సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ర్యాగింగ్ నిరోధం, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేసేలా విశ్వాసాన్ని కల్పించాలని చెప్పారు. ఏదైనా నేరానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత షీ-టీమ్ ఎస్‌హెచ్‌ఓకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి మహిళా పోలీసు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించాలని మహిళా పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి మల్లయ్య స్వామి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, షీటీం ఎస్‌హెచ్‌ఓ రమాదేవి, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించిన టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను రైతు డిస్కం, రెడ్ కో వైస్ చైర్మన్ అండ్ ఎండి ముషారఫ్ ఫారూఖి, టిజి ఎన్పిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్ రెడ్డి లు సందర్శించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వారికి ఘన స్వాగతం పలికారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిబింబించేలా పూల మొక్కలను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చేపడుతున్న చర్యలు, విద్యుత్ మౌళిక సదుపాయాల బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంపై సంక్షిప్తంగా వివరించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు టీజీఎన్‌పీడీసీఎల్ అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. ముషారఫ్ ఫారూఖి, కర్ణాటి వరుణ్ రెడ్డి లు జిల్లా యంత్రాంగం చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు సంస్థ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించడం, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి కి చేవెళ్ల మాజీ ఎంపీ నివాళి



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మ పార్థివ దేహానికి చేవెళ్ల మాజీ ఎంపీ డా. జి. రంజిత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రుక్కమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులైన నరేందర్ రెడ్డి, అవినాష్ రెడ్డి లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉండే వరి వంటి పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు అందించి, పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సాగునీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు మార్కెటింగ్, నీటిపారుదల (ఇరిగేషన్), భూగర్భ జలాల (గ్రౌండ్ వాటర్) శాఖల అధికారులు కూడా తప్పనిసరిగా పాల్గొని సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంలో పొదుపు పాటిస్తూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ హేమలత,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## పాత పూజా పటాల పునర్వినియోగానికి 'ప్రాజెక్ట్ ఉద్వాసన'

* **మౌలాలిలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న కార్యక్రమం**



మౌలాలి, ప్రజాస్ఫూర్తి : పాత పూజా చిత్రపటాలు, విగ్రహాలు, ఇతర పూజా సామగ్రిని చెత్తకుప్పల్లో లేదా నాలాల్లో పడేయకుండా శాస్త్రోక్తంగా నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో మౌలాలి డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ ఉద్వాసన' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా ప్రతి నెల నాలుగో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 11:00 గంటల వరకు ఎంపిక చేసిన ఆలయాల్లో పాత పూజా సామగ్రిని సేకరిస్తారు. అనంతరం ఆలయ పూజారుల సమక్షంలో శాస్త్రోక్తంగా 'ఉద్వాసన పూజ' నిర్వహించి, పటాలు, విగ్రహాల్లోని ప్రాణ ప్రతిష్ఠను సంప్రదాయ పద్ధతిలో ముగిస్తారు. తదుపరి వాలంటీర్ల సహాయంతో సేకరించిన సామగ్రిని చెక్క, గాజు, కాగితం, లోహం తదితర విభాగాలుగా వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తారు. దీంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు వ్యర్థాల సమర్థ నిర్వహణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాలకు గౌరవం ఇచ్చే ఈ వినూత్న కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మౌలాలి డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## అక్రమ పశువుల వాహనం పట్టివేత




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ తుఫాన్ పేట పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి వెంట అక్రమంగా పశువులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని తూప్రాన్ పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో పెట్రోలింగ్ పోలీసులు నరేష్, శ్రీహరిలు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అశోక్ లీలాండ్ మినీ (టీజీ 12 యూ 4443) వాహనాన్ని తనిఖీ చేయగా, 10పశువులు(ఆవులు 4, ఎద్దులు 6) ఉన్నాయి. పశువులను అట్టి వాహనం నడుపుతున్న డ్రైవర్ మహమ్మద్ అలీ(26)ని విచారించగా, యజమాని మహమ్మద్ యూసుఫ్ పశువులను కోదాడ సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు తెలిపాడు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గం ఏర్పాటు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మువ్వా జయ శ్రీ , సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్చార్జి నందనం దివాకర్ , రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీర్ రావుల శేషగిరి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్కా శంకర్ రెడ్డి ల సమక్షంలో ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ రిలీజ్ చేశారు. ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్, ఎం.శ్రీనివాస్, వి.యాదగిరి,కె.విద్యా సాగర్, జే.రవి యాదవ్, ఎ.మల్లేష్, ప్రధాన కార్యదర్శులుగా వి.జగన్ యాదవ్, జి. సతీష్ గౌడ్, ఎస్.ప్రకాష్, సెక్రెటరీగా శ్రీధర్ వర్మ, మల్లేష్ యాదవ్, ఎం.రమేష్, ఆర్.వెంకటేశ్వర్లు, పీ.శంకర్, పీ.రేణుక, ట్రెజరర్గా శ్రీనివాస రావు, స్పోక్ పర్సన్గా జి.రాజు యాదవ్, మీడియా కన్వీనర్ పి.కిరణ్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్గా జి.అనురాధ, బి.ఫణి కుమార్, ఐటీ కన్వీనర్గా ఎం.శివకాంత్, ఐటీ టీమ్ కో కన్వీనర్గా సి.రమేష్ యాదవ్, ఆఫీస్ సెక్రెటరీ వసుంధర, ఆఫీస్ జాయింట్ సెక్రటరీగా బి.తేజస్వీని, టూర్ మానిటరింగ్ కన్వీనర్ ఎ.దీలిప్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.రాజేందర్ గౌడ్, టి.శ్రీనివాస్గౌడ్, సి.శ్రావణ్, పి.రామయ్య, వి.కుమార్ యాదవ్, ఎల్.మురళీ కృష్ణలను ఎన్నుకున్నారు. రిలీజ్ కమిటీలో పదవి పొందిన నాయకులకు , నాయకురాళ్లకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాదగిరి, జిల్లా అధికార ప్రతినిధి రాజు యాదవ్ , ఆఫీస్ సెక్రటరీ వసుంధర, ఐటీ సెల్ కన్వీనర్ రమేష్ యాదవ్, కంది శ్రీరాములు, రమేష్, కేశవ్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా విట్యాల నర్సింహా

* **జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రంగారెడ్డి జిల్లా రూరల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన విట్యాల నర్సింహా ఎంపికయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు ఎంకనోళ్ల వెంకటేష్, జిల్లా నాయకులు శివ శంకర్, పవన్, ధరంపాల్ తదితరులు విట్యాల నర్సింహాకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంకనోళ్ల వెంకటేష్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన విట్యాల నర్సింహాకు జిల్లా ఎస్సీ మోర్చా బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. క్రిందిస్థాయి నాయకులందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాలో పార్టీకి మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేయాలని సూచించారు. నెలకొన్న బాధ్యతలపై విట్యాల నర్సింహా స్పందిస్తూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి పూర్తి న్యాయం చేస్తానని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఎస్సీ మోర్చాను బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ప్రతి గ్రామంలోనూ ఎస్సీలను బీజేపీతో అనుసంధానం చేస్తూ పార్టీ అభివృద్ధికి అందరితో కలిసి ముందుకెళ్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు మహేశ్వరి, రాజ్‌కుమార్, బీఎల్ఏలు వినయ్, లావణ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలి

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కోరారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమర్పించారు. శనివారం పెట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత ఎన్నికల సిబ్బందికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తమ హక్కుగా, బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని,. ప్రతి పౌరుడు తన కుటుంబ సభ్యులతో పాటు పొరుగువారు, స్నేహితులు, బంధువులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, ఓటు విలువను అందరికీ తెలియజేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు మహేశ్వరి, రాజ్‌కుమార్, బీఎల్ఏలు వినయ్, లావణ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో మోడి ప్రభుత్వం వైఫల్యం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: నీట్ పరీక్ష లీకేజీ విషయంలో ఢిల్లీ మెడలు వంచామని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం కాంగ్రెస్ పార్టీ సాధించిన గొప్ప విజయం అని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అన్నారు. శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై విద్యార్థుల పోరాటానికి మద్దతుగా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైందని, 152 పరీక్షల పత్రాలు అంగట్లో సరుకులాగా ఒక్కో ప్రశ్నాపత్రం 30 లక్షలకు అమ్ముకున్నారని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యొక్క మెడలు వంచే విధంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి ప్రభుత్వం దిగివచ్చేలా చేశామని అందులో భాగంగానే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని అన్నారు. విద్యార్థుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని వారు చెప్పారు. దేశంలో మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని ఈ సందర్భంగా వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ షఫివుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు

## షాద్‌నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై ఉమ్మడి నిరసన

* **ఎమ్మెల్యే శంకర్ ద్వంద్వ వైఖరి వీడాలని డిమాండ్**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ ద్వంద్వ వైఖరి ఒలంపిస్తున్నారని ఆ పార్టీల ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. ఎన్నికలకు ముందు అఖిలపక్ష సమావేశంలో అంబేద్కర్ విగ్రహాన్ని చౌరస్తాలో ప్రతిష్టిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విస్మరించారని నాయకులు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో మార్పు వచ్చిందని, పరోక్షంగా విగ్రహ తొలగింపునకు కారణమవుతున్నారని దుయ్యబట్టారు. ట్రాఫిక్ సమస్యలకు అంబేద్కర్ విగ్రహం కారణం కాదని, ప్రభుత్వ స్థలాలు , రహదారులను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ముందుగా ఆ అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆ తర్వాత చౌరస్తాను శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

## కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తా

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 278వ వార్డు, గాజులరామారం పరిధిలోని వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) కమిటీ సభ్యులు నేడు పెట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కేపీ వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి తమ కాలనీలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులు , నివాసితుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమా రెడ్డి, ఉపాధ్యక్షుడు అరవింద్, రాజేష్, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, కార్యవర్గ సభ్యులు మరియు ఇతర కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థుల మహాధర్నాకు ఎమ్మెల్సీ కోదండరామ్ సంఘీభావం

ఢిల్లీ: విద్యార్థుల మహాధర్నాకు సంఘీభావం ప్రకటిస్తున్నట్టు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ తెలిపారు. ఢిల్లీలో సీజేపీ నేతలను కలిసి మద్దతు తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''విద్యార్థులు న్యాయపరమైన డిమాండ్లు లేవనెత్తారు. పరీక్షలు సక్రమంగా జరిపి భవిష్యత్తు కాపాడాలని కోరుతున్నారు. పేపర్ లీక్‌లతో పాటు పరీక్షలు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. సీబీఎస్ఈ, నీట్ సహా దాదాపు 150 రకాల పరీక్షలు గందరగోళంగా మారాయి. భవిష్యత్తు ఏమవుతుందనే అయోమయ స్థితిలో విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు సరిగా నిర్వహించకపోవడం వల్లే ఆందోళనలు జరుగుతున్నాయి. విద్యార్థుల ఆందోళనకు ప్రజాస్వామ్యవాదులంతా మద్దతు ఇవ్వాలి. శాంతియుతంగా, చట్టబద్ధంగా విద్యార్థుల ఆందోళన జరుగుతోంది.

# ఘనంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి జన్మదిన వేడుకలు




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యానికేతన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శివరాత్రి యాదగిరి జన్మదిన వేడుకలు శనివారం అభిమానులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు మాజీ కార్పొరేటర్లు కొలుకుల జగన్, రావుల శేషగిరిరావు, మేడ్చల్ జిల్లా ఒబిసి మోర్చా అధ్యక్షులు జే.కె.శేఖర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రశీద్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కోలుకుల జైహింద్ లు పాల్గొని ఆయనకు శాలువాలతో పూలమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చేత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మేడ్చల్ ప్రెసిడెంట్ జె. నాగరాజు, ట్రెజరర్ పరశురామ్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వనజ అశోక్, డానియల్ రాజు, ట్రస్మా కుత్బుల్లాపూర్ మండల్ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, సెక్రటరీ నర్సిరెడ్డి, ట్రెజరర్ పవన్ కుమార్, గండిమైసమ్మ మండల్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, సెక్రటరీ అంబదాస్, మెడిపల్లి మండల్ ప్రెసిడెంట్ కమలాకర్ రావు, సెక్రటరీ రవిబాబు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ రావు, ట్రస్మా స్టేట్ అడ్వైసర్ రవీందర్ రావు, మల్లేష్, వెంకట్ స్వామి, శ్రీశైలం యాదవ్, జగన్, బాచుపల్లి మండల్ ట్రెజరర్ రాంబాబు, సుధాకర్ , చికిలే మధుబాబు, హెల్పింగ్ హర్ట్స్ సోసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్, చైతన్య విద్యా నికేతన్ పాఠశాల డైరెక్టర్స్ శివరాత్రి మంగాదేవి, శృతివిద్య, మధుసూదన్, నిఖిల్, ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ , వివిధ మండలాల ట్రస్మా ప్రతినిధులు, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించి చిత్ర బృందం



ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సిద్ధమైంది. జులై 27న స్పెషల్ అప్‌డేట్‌ను పంచుకోనుంది. ఈ సందర్భంగా కీలక నటులు ఏయే పాత్రల్లో కనిపించనున్నారో తెలియజేసింది. ఇందులో చిట్టిబాబు అనే పాత్రలో ఇద్దరు బిడ్డల తండ్రిగా వెంకటేశ్ నటిస్తున్నారు. స్వర్ణగా శ్రీనిధి శెట్టి, సంపూర్ణగా యువిన పార్వతి, శర్వాగా రాజ్ ప్రజ్వల్ నటిస్తున్నారు. జులై 27న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. అక్టోబరు 2న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేశ్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాకోసం ఎదురు చూసిన ప్రేక్షకులకు 'ఆదర్శ కుటుంబం'తో ఆకల నెరవేరనుంది.



## నిరసనలకు వ్యతిరేకంగా రీల్స్ చేయమన్నారు....

నీట్ పేపర్ లీక్ దుమారం వేళ విద్యార్థుల నిరసనలపై బిగ్‌బాస్ బ్యూటీ ఆకాంక్ష పూరి సంచలన వ్యాఖ్యలు చేసింది. కాక్రోచ్ జనతా పార్టీతో పాటు విద్యార్థుల నిరసనలకు మద్దతు తెలిపితే తనకు భారీగా డబ్బులు ఇస్తామని కొందరు ఆఫర్ చేశారని అన్నది. జంతర్ మంతర్ వెళ్లడానికి ఫస్ట్ క్లాస్ ఫ్లైట్ టికెట్స్ ఇస్తామన్నారు. ఈ నిరసనలపై రీల్స్, పోస్ట్‌లు పెట్టమని అడిగారు. వాటి కోసం డబ్బులు అరేంజ్ చేస్తామన్నారు. చాలా మంది క్రియేటర్లకు ఇలాంటి ఆఫర్లు వచ్చాయి. కొందరు డబ్బులకు ఆశపడి అంగీకరిస్తున్నారు. నేను మాత్రం ఒప్పుకోలేదు. విద్యార్థుల పోరాటానికి నిజాయితీగా మద్దతు తెలిపాలని అనుకున్నా" అంటూ ఆకాంక్ష చెప్పుకొచ్చింది.



## సౌత్ కంటే బాలీవుడ్ బెటర్

సౌత్ ఇండస్ట్రీపై మిల్కీ బ్యూటీ తమన్నా సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇటీవల ఫోర్బ్స్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడింది. హీరోయిన్లను గౌరవించే తీరు, స్వేచ్ఛ విషయంలో సౌత్ ఇండస్ట్రీతో పోలిస్తే బాలీవుడ్ ఎంతో మెరుగు. ప్రత్యేక గీతాలను ఐటెం సాంగ్స్ అని పిలవడం ఇబ్బందిగా అనిపిస్తుంది. తెలుగు, తమిళం, మలయాళ ఇండస్ట్రీలో పురుషాధిక్యత చాలా ఎక్కువ. కథానాయిక అనగానే కొందరిలో చులకన భావం కనిపిస్తుంది. తాను చాలాసార్లు ఎదుర్కొన్నా. గ్లామర్ కోసమే హీరోయిన్లను సినిమాల్లో తీసుకునే సంస్కృతి సౌత్‌లో కొనసాగుతూనే ఉంది. వారిని ఓ గ్లామర్ డాల్స్‌లానే చూస్తారు. అది తెలిసి కూడా తప్పనిసరి పరిస్థితుల్లో నేను చాలా సినిమాలు అంగీకరించా" అని తమన్నా చెప్పుకొచ్చింది.

## తమిళ మూవీలో పల్లెటూరి అమ్మాయిగా

రాజశేఖర్, జీవితల తనయ శివానీ నాలుగేళ్ల తర్వాత హీరోయిన్‌గా తమిళంలోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. దివంగత తమిళ అగ్ర హీరో విజయ్ కాంత్ తనయుడు షణ్ముగ పాండియన్ హీరోగా తమిళంలో వానవేదికపై పేరుతో ఓ రొమాంటిక్ యాక్షన్ లవ్‌స్టోరీగా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో హీరోయిన్‌గా శివానీ నటించబోతున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీలో ఆమె పల్లెటూరి అమ్మాయిగా డీ గ్లామర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. రా అండ్ రస్టిక్‌గా ఆమె క్యారెక్టర్ సాగుతుందని అంటున్నారు. ఈ మూవీకి తిరు దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా తెలుగులో అద్భుతం, జిలేబీ, కోటబొమ్మాలి పీఎస్‌తో పాటు విద్యావాసుల అహం అనే సినిమాలు చేసింది శివాని. 2022లో వచ్చిన అన్బరివు సినిమాతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.





## నారా రోహిత్ ట్రిపుల్ ట్రీట్

తన బర్త్‌డే సందర్భంగా నారా రోహిత్ ఫ్యాన్స్‌కు ట్రిపుల్ ట్రీట్ ఇచ్చాడు. తన కొత్త సినిమాల తాలూకు అప్‌డేట్స్‌ను శనివారం సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. హీరోగా రెండు సినిమాలతో పాటు విలన్‌గా ఓ సినిమా చేయబోతున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుతం హీరోగా కపాలితో పాటు సౌండ్ ఇంజినీర్ అనే సినిమాలు చేస్తున్నాడు. ఆ మూవీస్ ఫస్ట్ లుక్‌లను మేకర్స్ రిలీజ్ చేశారు.

## సీతగా ఎలా కనిపిస్తుందో..

రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణం' టీవీ సీరియల్ అప్పట్లో వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. రాముడి పాత్రలో అరుణ్ గోవిల్, సీతగా మెప్పించిన దీపికా చిఖ్లియా తమదైన నటనతో మెప్పించారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ' చిత్రంలో సీత పాత్రకు సాయిపల్లవిని ఎంపిక చేయడంపై దీపిక స్పందించారు. ప్రముఖ సినీ పత్రిక 'వెరైటీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. సాయిపల్లవి మంచి నటి. సీత పాత్రలో ఆమె ఎలా కనిపిస్తుందో చెప్పలేను. ఆమె నటనను చూశాను. అద్భుతమైన ప్రతిభ ఉన్న నటి. సీత పాత్రకు ఆమె రూపం ఎంతగా సరిపోతుందో తెరపై కనిపిస్తుంది. పౌరాణిక పాత్రలను పోషించడం నటులకు పెద్ద సవాలే అని చెప్పారు.





## ఓటీటీలోకి కాక్‌టెయిల్-2

రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించిన కాక్ టెయిల్ 2 మూవీ ఓటీటీలోకి రాబోతుంది. ఆగస్ట్ 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళంలో రిలీజ్ కాబోతుంది. రష్మిక, కృతి సనన్‌కు ఉన్న క్రేజ్ కారణంగా దాదాపు రూ.60 కోట్లకు కాక్ టెయిల్-2 ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. షాహిద్ కపూర్ హీరోగా నటించాడు. హోమీ అద్జానియా దర్శకత్వంలో దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో 160 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ ఏడాది బాలీవుడ్‌లో హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన టాప్ సిక్స్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. దీపికా పదుకోణ్ హీరోయిన్‌గా నటించిన కాక్ టెయిల్‌కు సీక్వెల్‌గా ఈ మూవీ రూపొందింది.



## ఈ మూవీలో ట్విస్ట్‌లు ఊహించలేరు..

* జయకృష్ణ ఘట్టమనేని

"ఘట్టమనేని అభిమానుల నమ్మకాన్ని నిలబెట్టాలి. మంచి కథలు, మంచి పాత్రలు చేయాలి'' అంటున్నారు జయకృష్ణ ఘట్టమనేని. అజయ్ భూపతి దర్శకత్వంలో ఆయన నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జయకృష్ణ ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు.

### అన్ని అంశాలు కుదిరాయి..

''నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అందుకే రెండేళ్ల పాటు ముంబయి, పుదుచ్చేరిలలో శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత న్యూయార్క్ కూడా వెళ్లాను. ఒకసారి జెమినీ కిరణ్‌గారు నాకు అజయ్‌ను పరిచయం చేశారు. ఆయన చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది. ఒక మంచి ఎమోషన్, మంచి క్యారెక్టర్ ఉన్న కథతో ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకున్నాను. అలా అన్ని అంశాలు ఈ కథలో కుదిరాయి.

### బాబాయ్ మెచ్చుకున్నారు..

''మహేష్ బాబాయ్ ప్రతి విషయంలో మార్గ నిర్దేశం ఇస్తారు. ఆయన సినిమా చూశారు. చాలా హ్యాపీగా ఫీలయ్యారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంగ్స్ చాలా నచ్చాయని చెప్పారు. స్క్రీన్ మీద చాలా డిఫరెంట్‌గా ఉన్నానని, క్యారెక్టర్‌లోకి పూర్తిగా వెళ్లిపోయానని చెప్పారు. వైజయంతి మూవీస్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ ద్వారా వెండితెరకు పరిచయమవడం సంతోషంగా ఉంది. బాబాయ్ తొలి సినిమా కూడా వైజయంతి మూవీస్‌లోనే వచ్చింది''

### * ఈ ప్రయాణంలో చాలా నేర్చుకున్నా..

''శ్రీనివాస మంగాపురం' చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. క్యారెక్టర్స్, ఎమోషన్స్ అన్నీ కూడా రస్టిక్‌గా అనిపిస్తాయి. ఇదొక వైవిధ్యమైన లవ్‌స్టోరీ. ట్విస్టులు కూడా చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమా కోసం 70 రోజుల పాటు అవుట్‌డోర్ షూటింగ్ చేశాం. ప్రతిదీ పబ్లిక్‌లోనే షూట్ చేశాం. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇక మోహన్‌బాబుగారు వెరీ స్వీట్. చాలా క్లోజ్‌గా ఉంటారు. కెమెరా ముందుకు వచ్చే సమయంలో మాత్రం ఏకాగ్రతతో ఉంటారు''

### యాక్షన్ సినిమాలంటే ఇష్టం..

''నాకు యాక్షన్ చేయడం చాలా ఇష్టం. యాక్టర్ కావాలనుకున్నప్పుడే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సినిమాలో కొన్ని సర్‌ప్రైజెస్ కూడా ఉన్నాయి. వాటిని ప్రేక్షకులు ఊహించలేరు. దర్శకుడు అజయ్ భూపతి చాలా స్పష్టత ఉన్న దర్శకుడు. ఆయనతో తొలి సినిమా చేయడం నా అదృష్టం. నాకు అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. అయితే పర్సనల్‌గా నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. మంచి కథలతో ప్రేక్షకులను అలరించాలని ఉంది''

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.